

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : గురువారం 6:24(సాయంత్రం)

సెహరీ : శుక్రవారం 4:54 (ఉదయం)

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

కలెక్టర్ కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 27: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో భాగంగా రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్ణయంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధించి ఎస్వీఆర్, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలను గుర్తించామని అన్నారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించి ఆమోదం కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి సువిధ సర్వీసు ద్వారా 152 దరఖాస్తులు వచ్చాయని, అందులో 132 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామనిని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చే నెల 16వ తేదీ వరకు ఫార్మ్-6 అభ్యర్థనలు, ఫార్మ్-8 ద్వారా షిఫ్టింగ్‌కు ఏప్రిల్ 15 వరకు అభ్యర్థనలని స్వీకరిస్తామని చెప్పారు.


ఉగాది ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 27: శ్రీశైల మహా క్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా జరపనుంది. ఈ సందర్భంగా బుధవారం ఉగాది ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యాల కల్పనలో అన్ని కోణాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాస ద్వారం ప్రాంతాల్లో తాగునీరు, వైద్యశిబిరాలు, తదితర సదుపాయాల కల్పనకు లోటులేకుండా చూడాలన్నారు. ఉత్సవాలలో స్వామిఅమ్మవార్ల కైంకర్యాలన్నీ సంపూర్ణంగా జరిపించేలా చర్యలు తీసుకోవాలని వైదిక సిబ్బందికి సూచించారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుంచే క్షేత్రానికి అధిక సంఖ్యలో కన్నడ భక్తులు విచ్చేస్తారని స్వామి, అమ్మవార్ల సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు క్యూలైన్లలో ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు నిరంతరం మంచినీరు, మజ్జిగ, అల్పాహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రపరిధిలోని ఆరుబయట ప్రదేశాలు, పార్కింగ్ తదితర ప్రదేశాలలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిర్లు ఏర్పాటు చేయాలన్నారు.

రేపు బనగానపల్లెకు చంద్రబాబు



'ప్రజాగళం' పర్యటనను జయప్రదం చేయండి : మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె పట్టణానికి 29వ తేదీ శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రానున్నారు. 'ప్రజాగళం' పేరిట చంద్రబాబు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నంద్యాల జిల్లాకు రానున్నారు. చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ శ్రేణులతో పాటు, ప్రజలకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు పర్యటన వివరాలను వెల్లడించారు. వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు చంద్రబాబు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని బీసీ పిలుపునిచ్చారు.

పర్యటన వివరాలివి..

చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి 10:55 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయల్దేరి బనగానపల్లె పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఉన్న కాట్రెడ్డి లేఔట్ వద్దకు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో బనగానపల్లె పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోల్ బంకు కూడలికి చేరుకుంటారు. ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకు చైతన్య రథంపై జరిగే బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12:40 గంటల నుంచి బనగానపల్లె పట్టణంలో మధ్యాహ్న భోజన విరామం ఉంటుంది. ఆ తర్వాత 1:45 గంటలకు హెలిపాడ్ వద్దకు చంద్రబాబు చేరుకుంటారు. తర్వాత 1:50 గంటలకు నెల్లూరు జిల్లా కావలి బయల్దేరి వెళ్తారు.



చంద్రబాబు పర్యటన వివరాలను వెల్లడిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

దిగువ అహోబిలంలో గరుడోత్సవం

నంద్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదస్వామికి గరుడోత్సవం కార్యక్రమాన్ని అశేష భక్తజనాల మధ్య బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. ముందుగా ప్రహ్లాద వరద స్వామికి ఉత్సవం, ద్వాదశారాధనం పుష్పయాగం కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు..

దిగువ అహోబిలంలో..

దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామికి తెప్పోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు చేపట్టారు. దేవాలయ సమీపంలోని కోనేటిలో ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వామి, అమ్మవార్లలను విశేషంగా పూలమాలలతో అలంకరించి, పూజలు నిర్వహించి, విద్యుద్దీపాలంకరణలో రాత్రి 8గంటల నుంచి తెప్పోత్సవం చేపడుతున్నామని తెలిపారు.



గరుడ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాద వరదస్వామి →

ముగిసిన పదో తరగతి పరీక్షలు

● సోషల్ పరీక్షకు 1699 మంది గైర్హాజరు



నంద్యాల (నూనెపల్లె), మార్చి 27 : పదో తరగతి వార్షిక పరీక్షలు-2024 ఈనెల 18న ప్రారంభమై బుధవారం సోషల్ స్టడీస్ పరీక్షతో ముగిశాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాల నుంచి సంతోషంగా బయటకు వచ్చారు. బుధవారం జరిగిన జరిగిన పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 134 పరీక్షా కేంద్రాలలో 25,984 మంది విద్యార్థులకుగాను 24,285 మంది హాజరు కాగా 1699 మంది గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. 93.46 శాతం హాజరు నమోదైందని అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 24 పరీక్షా కేంద్రాలను పరిశీలించగా, పరీక్షల రాష్ట్ర పర్యవేక్షకురాలు ఆర్‌ఎస్ గంగా భవాని 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్ష సజావుగా నిర్వహించామని ఆమె తెలిపారు.

రమణీయం.. రంగనాథుడి రథోత్సవం

మద్దికెర, మార్చి 27: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు రంగనాథస్వామి, భూదేవి శ్రీదేవి కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. దివంగత పారా రామన్న కుమారులు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న), పారా జయవర్దన్‌లు రంగనాథ స్వామికి నూతన వస్త్రాలను సమర్పించారు. కంసాలి బ్రహ్మయ్య మంగళసూత్రం సమర్పించగా.. పురోహితులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మూల విరాట్ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు రథం ముందు హోమం చేశారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య ఉత్సవమూర్తులైన రంగనాథ స్వామిని రథంపై ఆశీలను చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని తహసీల్దార్ రజాక్‌వలి టెంకాయ కొట్టి ప్రారంభించారు. రంగనాథుని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథంపై అరటి పండ్లు వేస్తూ భక్తిని చాటుకున్నారు.



అశేష జనవాహిని నడుమ కొనసాగుతున్న స్వామివారి రథోత్సవం

ఆకలితో ఆరు వారాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 27:

జగన్ ప్రభుత్వం ఉపాధి కూలీలతో పనులు చేయించింది. కానీ వేతనాలు ఇవ్వడం లేదు. సరిగ్గా ఆరు వారాలైంది. నిత్యం పని చేసి, కూలి డబ్బులు తీసుకుంటేగాని కడుపు నింపుకోలేని ఉపాధి కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. కానీ ఈ రాష్ట్రాన్ని ఏలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జనం బాధలు పట్టవనే విమర్శలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఎర్రటి ఎండల్లో పనులు చేస్తున్న పేదలకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన కూలి పట్ల ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమనే నిరసనలు పెల్లుబుకుతున్నాయి.

వైఎస్ జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు రాష్ట్రంలో ఒక్కరు కూడా కన్నీరు పెట్టకుండా చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేశారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు జిల్లాలో ఆరు వారాలుగా కూలి డబ్బులు ఇవ్వడం లేదు. వాళ్లు ఆకలితో అలమటిస్తున్నారు. జగన్ రెడ్డి మాటకు.. చేతలకు పొంతన ఉండదనడానికి ఇది తాజా ఉదాహరణ. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దాదాపు 60 వేల మంది రైతులు, రైతు కూలీలు పనులు చేస్తున్నారు. వీరికి గత ఆరు నెలలుగా కూలీ డబ్బులు అందక పస్తులతో కాపురాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.10 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.5 కోట్ల దాకా కూలీ బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మరో పది రోజుల్లో ఉగాది పండుగ వస్తోంది. కుటుంబ సభ్యులకు కొత్త బట్టలైనా కొనడానికి చేతిలో డబ్బులు లేవని, పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిందేనని కూలీలు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా 2 నెలల పాటు కూలి డబ్బులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడ్డామని, ఎంతో ఒత్తిడి తెస్తే తప్ప.. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయలేదని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వివిధ కారణాల వల్ల సకాలంలో ఉపాధి హామీ పథకం నిధులు విడుదల చేయలేని పరిస్థితులు నెలకొన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిధులను సమకూర్చుకుని కూలీలకు వేతనాలు ఇవ్వాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పరిస్థితి లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేయకున్నా కూలీలను ఇబ్బందులకు గురి చేయకూడదనే ఉద్దేశంతో ప్రతి వారం ఆఖరుకు డబ్బులు అందించేవారు. అదే విధంగా గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున పనిదినాలను కల్పించేవారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్ష్యాన్ని సాధించినందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవార్డులు ఇచ్చింది.

- ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల బకాయిలు
- పట్టించుకోని జగన్



● జాబ్ కార్డులు ఘనం.. పనులు చేసే వారి సంఖ్య మాత్రం నామమాత్రమే:

గత టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వ్యవసాయ సీజన్ పూర్తయినా వేసవి సీజన్‌లో రైతులు, రైతు కూలీలు వలస వెళ్లకుండా పని దినాలను కల్పించింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఉపాధి హామీ కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. వారాల తరబడి కూలీ డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు సకాలంలో ఉపాధి పనులు చేపట్టకపోవడంతో ఈ పనులపై ఆశలు వదులుకున్న రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున వలసబాట పడుతున్నారు. ఈ పథకం ద్వారా పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వం ఇచ్చిన జాబ్‌కార్డులకు మించి రైతులు, కూలీలు ఉపాధి పనులకు పరుగులు తీస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో మాత్రం జాబ్‌కార్డులు ఇచ్చిన మొత్తంలో కనీసం సగం మంది కూడా పనికి రాకపోవడం దారుణం. కర్నూలు జిల్లాలో మూడున్నర లక్షల మంది కుటుంబాలకు జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. అయితే.. ప్రస్తుతం పనులు చేస్తున్న వారి సంఖ్య మాత్రం 35వేల మంది మాత్రమే. అదే విధంగా నంద్యాల జిల్లాలో రెండున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. పనులు చేస్తున్న వారు మాత్రం 25 వేల మందికి మించి రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధులతో సంబంధం లేకుండా వెంటవెంటనే కూలీ డబ్బులు అందజేస్తే ఈ దారుణ పరిస్థితి ఉండేది కాదు. మరోవైపు రైతులు, కూలీలు వెంటవెంటనే పనులు చేసుకునే అవకాశాన్ని కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులను గుర్తించి వాటికి అనుమతులు సాధించి రైతులు, కూలీలు పనులు చేసేలా అవగాహన కల్పించమని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వడం లేదనే చెప్పాలి.

● సిబ్బందికీ వేతన కష్టాలు:

ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలను అందించకపోవడంతో వారు లక్ష్యాలను చేరుకునే విషయంలో సరైన శ్రద్ధ చూపడం లేదు. రైతులు, కూలీలు చేసిన పనులకు కూలీ డబ్బులు అందక ఏ విధంగా పస్తులుంటున్నారో అదే విధంగా సిబ్బంది కూడా వేతనాల్లేక అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు గతంలో వేసవి భత్యం కింద అదనంగా కొంత మొత్తాన్ని కూలీలకు చెల్లించేవారు. గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికారు. వాస్తవంగా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఈ వేసవి భత్యాన్ని కూలీలకు అందించాల్సి ఉంది. ఈ భత్యాన్ని రోజువారి కూలీతో పాటు గతంలో చెల్లించేవారు. ఇలా రోజు వారి కూలీకి అదనంగా ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం లభించడంతో కూలీలు ఎంతో ఉత్సాహంగా పనులు చేసేవారు.

● త్వరలో చెల్లిస్తాం

ఉపాధి కూలీలకు డబ్బులు దాదాపు 6 నెలలవి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వేసవి భత్యం గతంలో కేంద్ర ప్రభుత్వం చెల్లించేది. ప్రస్తుతం ఇవ్వడం లేదు.

- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

కోడ్‌పై 24 గంటల పర్యవేక్షణ

● ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి జి.నాసరరెడ్డి



కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కేంద్రం 24 గంటలు పర్యవేక్షిస్తుందని ఎన్నికల నియమావళి ప్రవర్తన జిల్లా నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ జి. నాసరెడ్డి తెలిపారు. బుధవారం జడ్పీలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన్నపటి నుంచి జడ్పీలోని మినీ సమావేశంలో భవనంలో ఎన్నికల నియమావళి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నేటి వరకు దినపత్రికలలో వచ్చిన 42 ప్రతికూల వార్తలను సంబంధిత మండల ప్రవర్తనా నియామావళి టీంలకు పంపించామని తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో అనధికారికంగా ఏర్పాటు చేసి 16,020 గోడ రాతలు, పోస్టర్లు తొలగించారని అన్నారు. ప్రైవేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 42 పోస్టర్లను కూడా తొలగించారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 17 మంది వలంటీర్లు, ఒక డీఆర్‌డీఏ ఐకేపీ, కేఎంసీ డ్రైవ రు-1, సహకార బ్యాంకు అంటెండరు-1ని ఉద్యోగం నుంచి తొలగించామని అన్నారు. భారత ఎన్నికల సంఘం ఏర్పాటు చేసి సీ విజిల్ యాప్ ద్వారా నేటి వరకు 89 ఫిర్యాదులు రాగా సహేతుకమైన 61పై విచారించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిగిలిన వాటిని 100 నిమిషాలలో అధికారులు పరిష్కరిస్తారని అన్నారు.

వైభవంగా లక్ష్మీ మాధవుడి కల్యాణం

గరుడ వాహనంపై స్వామివారి విహారం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోడుమూరు(రూరల్), మార్చి 27: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువజామున స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గోరంట్ల, ఎర్రగుడి గ్రామప్రజలు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చారు. వేదపండితుడు వందవాసి రాధాక్రిష్ణ అధ్వర్యంలో మంత్రాలు పఠిస్తూ లక్ష్మీ మాధవుల కల్యాణం జరిపించారు. ఆలయం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది. ముడుమల గుర్తికి చెందిన కరణం లక్ష్మీనారాయణ, సావిత్రమ్మ దంపతులు అమ్మవారికి మంగళసూత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గుర్రెడ్డి సిబ్బంది మురళి, మాధవనాయుడు పాల్గొన్నారు.

● లక్ష్మీ మాధవస్వామి కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులకు గరుడవాహన సేవ చేశారు. టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి టెంకాయ కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, దుబ్బన్న, పరమేశ్వరనాయుడు, ఎర్రగుడి వర్ధన్‌రెడ్డి, రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

తమ్ముడి మృతి

బాధను దిగమింగి పరీక్షలు రాసిన సోదరీమణులు



కిషోర్ కుమార్ (ఫైల్)



తమ్ముడు మృతితో దుఖంతో పరీక్షలు రాసి వచ్చిన విద్యార్థినులు

మంత్రాలయం, మార్చి 27: తమ్ముడు మృతి చెందిన బాధలోనూ పదో తరగతి పరీక్షలు రాశారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వగరూరు అరుణ్, సువర్ణలమ్మ దంపతుల కుమారుడు కిషోర్ కుమార్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆయాసంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కిషోర్‌కుమార్ సోదరీమణులు మమత, అక్షర ఆ బాధను దిగమింగుకొని బుధవారం పదో పరీక్షలు రాశారు. అనంతరం తమ్ముని అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

ఎమ్మిగనూరురూరల్, మార్చి 27: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సందీప్(12)అనే బాలుడు మృతి చెందాడు. ఆదోని వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని, ఎమ్మిగనూరు వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ప్రయాణిస్తున్న సందీప్ మృతి చెందగా, ఈశ్వర్ అనే వ్యక్తితోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆదోని పట్టణానికి చెందిన వారు పెళ్లి సంబంధం చూసేందుకు ఎమ్మిగనూరు మండలం కే తిమ్మాపురానికి బొలేరో వాహనంలో బయలు దేరారు. అలాగే కర్ణాటకకు చెందిన వారు మంత్రాలయం నుంచి ఆదోని వైపు కారులో ప్రయాణిస్తున్నారు. బనవాసి ఫారం దగ్గర బొలేరోను కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : టంగుటూరు వాసి మృతి

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె మండలంలోని కైప అప్పలాపురం మార్గమధ్యలో ఆటో బోల్తాపడి టంగుటూరుకు చెందిన మాల బాల చౌడయ్య(60) అనే వ్యక్తి మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు బుధవారం తెలిపారు. బనగానపల్లె నుంచి టంగుటూరుకు బాలచౌడయ్య వెళ్తుండగా ఆటోలో వెళ్తుండగా బోల్తా పడి బాలచౌడయ్య మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె పట్టణ శివారులోగల బ్రహ్మంగారి మఠం సమీపంలోని శ్మశాన వాటిక వద్ద 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిని పట్టణంలోని తెలుగుపేటకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి హత్య చేసిననట్లు బనగానపల్లె పోలీసులు బుధవారం తెలిపారు. పట్టణ శివారులోని బహిర్భూమికి వెళ్లిన ఇరువురు ఒకరికొకరు ఘర్షణ పడడంతో రాజేశ్ గుర్తు తెలియని వ్యక్తిపై బండ రాయితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్య శాలకు తరలించి రాజేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బ్రహ్మంగారి మఠం వద్ద ఉన్న భోజన శాలలో భోజనం చేసి మఠం వద్దనే నివాసం ఉండేవాడని పోలీసులు తెలిపారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.30 కోట్లు

మంత్రాలయం, మార్చి 27: రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,30,26,480 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, శ్రీపతి ఆచార్ తెలిపారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆదేశాల మేరకు బుధవారం ఫిబ్రవరి 2 రోజులతో పాటు మార్చి 27 రోజులకు సంబంధించిన 29 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.2,30,26,480 నగదుతో పాటు 848 గ్రాముల వెండి, 81 గ్రాముల బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, జేపీ స్వామి, నరసింహ దేశాయి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, వాణి, గురురాజ్ పాల్గొన్నారు.

మహిళా జైలు తనిఖీ

కర్నూలు(లీగల్), మార్చి 27: మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. అక్కడుంటున్న మహిళా ఖైదీలకు అందిస్తున్న సదుపాయాల గురించి ఆయన జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళా ఖైదీలనుద్దేశించి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం అవసరమైన మహిళా ఖైదీలకు తమను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఆ తర్వాత జైలులో ఖైదీల గదులను, వంటశాలను, రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఈయనతో పాటు ప్యానల్ న్యాయవాది బద్దెల లక్ష్మి నారాయణ ఉన్నారు.

నేటి నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు(అర్బన్), మార్చి 27: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ పరీక్షలు ఈనెల 28 నుంచి ఏప్రిల్ 22 వరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. 2,4,6,8,10 సెమిస్టర్లకు సంబంధించి కర్నూలు ఉస్మానియా కళాశాలలో 646 మంది విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన డోన్ మార్కెట్ యార్డు చైర్మన్



మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి

డోన్, మార్చి 27: డోన్ నియోజకవర్గంలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు మరో 250 మంది వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మొదటి నుంచి మంత్రి బుగ్గన వెంట నడిచిన రాజా నారాయణమూర్తి సోదరులు టీడీపీలో చేరడంతో అధికార పార్టీకి భారీ షాక్ తగిలినట్టయింది. కోట్ల కుటుంబం మీద ఉన్న అభిమానంతో చంద్రబాబు నాయకత్వం రావాలన్న ఉద్దేశంతో టీడీపీలో చేరినట్లు రాజా నారాయణమూర్తి తెలిపారు. ఇదివరకే అంకిరెడ్డి వైసీపీని వీడడం, మరో వైసీపీ నేత ఇప్పుడు టీడీపీలో చేరడంతో ప్యాపిలిలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ అధికార మదంతో మంత్రి బుగ్గన కోట్ల కుటుంబాన్ని అవహేళనగా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో బుగ్గన తన వ్యాపారాలు, సొంత జేబులు నింపుకోవడానికి అభివృద్ధి పనులు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైనాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, డోన్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జనసేన, బీజేపీ ఆలా మోహన్ రెడ్డి, వడ్డె మహారాజ్, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరస్తుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు, మార్చి 27: ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా అధిక ఆదాయం సంపాదించవచ్చని ఆశ చూపి పలువురిని మోసం చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు నవీన్ కుమార్‌ను అరెస్టు చేసి అతనితోపాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐడీ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మునగాలపాడుకు చెందిన నవీన్ కుమార్‌పై 143 ఆన్‌లైన్ ఫిర్యాదులు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. నవీన్ కుమార్ తనకు తెలిసిన వారిని పరిచయం చేసుకుని ఎస్‌పీ ట్రేడింగ్ కంపెనీలో కొంత నగదు పెట్టుబడి పెడితే.. నెల రోజులకు కొంత నగదు తిరిగి వస్తుందని నమ్మించేవాడు. ఆ తర్వాత కొంత మందిని చేర్పిస్తే.. అందులో కూడా కమీషన్ల రూపంలో కొంత ఆదాయం వస్తుందని చెప్పేవాడు. బెంగళూరు కేంద్రంగా ఈ ఎస్‌పీ ట్రేడింగ్ కంపెనీ ఉందని, దీనికి మేనేజింగ్ డైరెక్టర్ రమణ నాగ్ ఉన్నారని, ఆన్‌లైన్ ద్వారా ఒక లింక్ పంపిస్తే.. ఆ లింక్ ద్వారా అకౌంటు ఓపెన్ అవుతుందని, అందులో కొంత మొత్తం జమ చేయాలని తమకు తెలిసిన వారందరికీ సంబంధిత లింకులను పంపాడు. ఇలా జంగం వీరలక్ష్మి అనే యువతికి కూడా లింక్ పంపాడు. ఆమె ఆ లింక్ ద్వారా ఆమె ద్వారా దఫాలుగా రూ.4.87 లక్షలు పెట్టుబడి పెట్టించాడు. బాధితురాల నుంచి ఆ మొత్తం జమ చేసిన తర్వాత సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నవీన్‌ను ఆమె నిలదీసింది. ఈ విషయంపై నవీన్ పలుసార్లు మాయమాటలు చెబుతూనే వచ్చాడు. చివరకు తాను మోసపోయానని గుర్తించిన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. సీఐడీ డీఎస్పీ దైవ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ నగేష్‌బాబు, ఎస్ఐ బండే సాహెబ్ ఆధ్వర్యంలోని ఓ టీమ్ కేసును ఛేదించారు. నిందతులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

వాట్సాప్ ప్రచారాలకు అడ్డుకట్ట

- అడ్మిన్లుగా ఉన్న వైసీపీ నాయకుల తొలగింపు
- ఎన్నికల నిబంధనలు పాటించాలని హెచ్చరికలు



ఆత్మకూరు, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారాలకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. వాస్తవానికి ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా సచివాలయ, వలంటీర్లు, మున్సిపాలిటీ ఇతర శాఖలకు సంబంధించిన అధికారిక గ్రూపుల్లో వైసీపీ నాయకులకు స్థానం కల్పించి అడ్మిన్లుగా నియమించారు. అంతేకాదు కొందరు వైసీపీ నాయకులే అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో ఆయా శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేసేవారు. అంతటితో ఆగకుండా వైసీపీకి అనుకూలంగా ప్రచారాలతో కూడిన సందేశాలు, యూట్యూబ్ లింక్స్, పలు సర్వేల వివరాలను పంపించేవారు. అయితే ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ నాయకులను చేర్చడంతో పాటు వారికి అడ్మిన్ పవర్స్ కల్పించి వారి సందేశాలను గ్రూపుల్లో వైరల్ చేస్తున్న విషయాలపై ప్రతికల్లో కథనాలు రావడంతో ఎట్టకేలకు ఎన్నికల అధికారులు స్పందించారు. వీరి ఆదేశాల మేరకు ఆయా శాఖలకు సంబంధించి అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో హుటాహుటిన వైసీపీ నాయకులను అడ్మిన్లుగా తొలగించి, ఆయా గ్రూపుల్లో కేవలం అధికారులు మాత్రమే అడ్మిన్లుగా ఉండేలా మార్పులు చేశారు. అలాగే గ్రూపుల్లో సభ్యులందరు సందేశాలను తిరిగి పంపేందుకు వీలు లేకుండా కేవలం అడ్మిన్లు మాత్రమే గ్రూపుల్లో సందేశాలు పంపించేలా సెట్టింగ్స్ మార్పుచేశారు. అయితే పలు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో మాత్రం ఇప్పటికీ కొందరు వైసీపీ నాయకులు సభ్యులుగా కొనసాగుతుండటం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు పాటించాలని హెచ్చరికలు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాట్సాప్ వినియోగంలో తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని జిల్లా కలెక్టర్ ద్వారా ఆయా మండలాల ఎంపీడీవోలకు, మున్సిపాలిటీల కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసి ఎన్నికల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది. దీంతో వీరు తమ పరిధిలోని ఆయా సచివాలయాలు, వలంటర్లు ఇతర అధికారిక గ్రూపుల్లో హెచ్చరికలతో కూడిన ఆ సందేశాలను ఫార్వర్డ్ చేసి అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాట్సాప్ గ్రూప్ లేదా వ్యక్తిగత వాట్సాప్ ఐడీలో డీపీ ఫొటో ఏదైనా రాజకీయ నాయకుడి లేదా, ఆ పార్టీ లోగోను ఉంచరాదని సూచించారు. ఎవరైనా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఇతర అధికారులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లయితే అలాంటి సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఎన్నికల నియామవళిని అమలు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 27: ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇందుకు 48 గంటలు ముందుగా సువిధా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కానీ కొన్ని అత్యవ సర పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకు నేందుకు అవకాశం లేనిపక్షంలో ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా బ్రహ్మాజి

● ఏకగ్రీవంగా ఎన్నుకున్న వైద్యులు



కర్నూలు(హాస్పిటల్), మార్చి 27: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కర్నూలు మెడికల్ కాలేజీ యూనిట్ అధ్యక్షునిగా ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజి మాస్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏపీజీడీఏ జనరల్ బాడీ సమావేశం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓల్డ్ సీఎల్‌జీలో వాడివేడిగా జరిగింది. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలని కొందరు, వైద్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని మరికొందరు వైద్యుల మధ్య వాదన జరిగింది. చివరకు ఏపీజీడీఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డా.విజయానందబాబు అధ్యక్షుడిగా బ్రహ్మాజి పేరును ప్రతిపాదించగా.. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఏపీజీడీఏ కేఎంసీ యూనిట్ అధ్యక్షుడిగా డా.బ్రహ్మాజి మాస్టర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ విజయ మోహన్ రెడ్డి, కోశాధికారి డమం శ్రీనివాసులు, జనరల్ కౌన్సిల్ సభ్యులు సోమప్ప, మాధవి శ్యామల, ఉపాధ్యక్షులు జయరాం, ఎం.మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వెంకటరమణ, వైకేసీ రంగయ్య, మురళీ ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



పాములపాడు మోడల్ స్కూల్ వద్ద విద్యార్థులు

పగిడ్యాల, మార్చి 27: ఈ నెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. ఈ ఏడాది పగిడ్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మాపురం బాలికల గురుకుల పాఠశాల, ముచ్చుమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ముగియడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

కొత్తపల్లి: ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు కొత్తపల్లి, గోకవరం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పది పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయి. పరీక్షలు ముగిసిన వెంటనే ఆయ గ్రామాల విద్యార్థులు కేరింతలు వేస్తూ ఆనందోత్సాహాలతో గ్రామాలకు వెళ్లిపోయారు. చివరిరోజు బుధవారం కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి పరీక్ష కేంద్రంలో జరిగిన పరీక్షకు కొత్తపల్లి సెంటరులో 154 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 138 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు. అలాగే గోకవరం సెంటరులో 100 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 81 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారని ఆయా సెంటర్ల చీఫ్ ఎగ్జామినర్లు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు.

పాములపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసినట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. పాములపాడులోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగి జరిగినట్లు తెలిపారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 27: రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు సూచించారు. ఎండ తీవ్రత వడగాల్పులు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండ తీవ్రత గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ఎండ తీవ్రత వల్ల అప్రమత్తంగా వుంటూ నెత్తికి టోపీ లేదా రుమాలు కట్టుకొని, కాటన్ వస్త్రాలు ధరించి, కళ్లకు రక్షణకోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని సూచించారు. తరచుగా నీటిని త్రాగుతూ ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు లేక నిమ్మకాయ రసం, కొబ్బరినీరు తాగాల న్నారు. ఎవైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యున్ని సంప్రదిం చాలన్నారు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలు మానుకోవాలని సూచించారు. ప్రకాశించే బలుపులను వాడవద్దని, అవి అనవసరమైన వేడిని విడుదల చేస్తాయని తెలిపారు.

'స్థానిక చట్టాల మేరకే హోర్డింగ్‌లకు అనుమతి'

నంద్యాల (కల్చరల్), మార్చి 27: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగులను తొలగించకుండా కొనసాగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణకు ముందస్తు చేస్తున్న ఏర్పాట్లను, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు తీరును సమీక్షించారు. కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో



మహానంది క్షేత్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డి

మహానంది, మార్చి 27: మహానంది క్షేత్రంలో బుధవారం నంద్యాల అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో రామ కొండారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముఖ మంటపం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్క్వాడ్ డీఎఫ్‌వో దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. అలంకార మంట పంలో వేదపండితులు వీరిని శాల్వతో సన్మానించి ప్రసాదాలు అందచేశారు. వీరివెంట అటవీ సిబ్బంది వీర ప్రతాప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల, మార్చి 27: ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ లోన్‌లు, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌ల నగదు బకాయిలు మొత్తం రూ.5,500 కోట్లు ఈనెల చివరికి ఉపాధ్యాయ, ఉద్యోగుల ఖాతాలకు జమ చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గత నెలలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 4 రోజుల సమయం ఉన్నందున తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వహణ, స్కూల్ కాంప్లెక్స్, ఎమ్మార్సీ నిర్వహణ నిధులను విద్యా సంవత్సరంలో చెల్లించక పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, నాగన్న, జిల్లా కార్యదర్శి మునిస్వామి, మండల శాఖ అధ్యక్షుడు బాలస్వామి, ప్రధాన కార్యదర్శి మానపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 27: జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించి అవసరమైన నిధులను విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని 29 మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొని ఉందని, సమస్యను ముందస్తుగా పరిష్కరించ డంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించే విధంగా పని చేయాలని కోరారు. సీపీఐ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు
- భయాందోళనలో విద్యార్థులు

పాణ్యం, మార్చి 27: మండలంలోని కొండజూటూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాల ఎదురుగా ఉన్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, సమీప ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. 30ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు పిల్లర్లు, గోడల సిమెంటు పెచ్చులూడి, ఇనుప కడ్డీలు బయటపడి తుప్పు పడుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకు నీటి సరఫరాకు ఈ ట్యాంకు పైపులైను కలిపి ట్యాంకును వెంటనే తొలగించాలని కోరుతున్నారు. నిత్యం పిల్లలు ట్యాంకు వద్ద ఆటలాడుతూ ఉంటారని, కూలితే భారీ నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్‌ను వివరణ కోరగా ఓవర్‌హెడ్ ట్యాంకు సమస్య తన దృష్టికి వచ్చిందని చెప్పారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో రిపేరీ, తొలగింపు పనులు చేపట్టలేదని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అప్పటి వరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.



శిథిలమైన ట్యాంకు

శాంతిరాం కళాశాలలో కొత్త కోర్సులు

పాణ్యం, మార్చి 27: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో కొత్త కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా కళాశాలలో ఐవోటీ డొమైన్ స్పెషలిస్ట్, ఏఐ క్వాలిటీ అనలిస్ట్, వీఎల్ఎస్ఐ డిజైనర్ కోర్సులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో నమోదు చేసుకున్న 240 మంది విద్యార్థులకు డిజిటల్ కోర్సుల ప్రాముఖ్యత గురించి డీన్ సౌమ్య వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు మల్లికార్జునరావు, డేవిడ్ సుకీర్తి కుమార్, వీరేష్, ఇందాద్ అలీ, నాగమణి, లక్ష్మీచైతన్య, భాస్కర్, రాంబాబు, జావిద్ పాల్గొన్నారు.

ఆర్జీఎం కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం

పాణ్యం, మార్చి 27: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సాంకేతిక సదస్సు అమోఘ 2కె24 ప్రారంభమయింది. సీఎస్ఈ అండ్ బీఎస్, ఏఐఎంఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హైదరాబాదు డెల్ టెక్నాలజీస్ సీనియర్ ప్రోగ్రామర్ నరేష్ బిల్లా పాల్గొన్నారు. సదస్సులో 60 మంది సాంకేతిక పేపర్లు ప్రదర్శించారని సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. డ్యాన్స్ డాష్‌కు 8 మంది, టెక్నికల్ క్విజ్‌లో 103 మంది, డిజైన్ కాంటెస్ట్‌లో 16 మంది, కోడింగ్ కాంటెస్ట్‌లో 152 మంది, పిక్సెల్ పెస్ట్‌లో 8 మంది, గేమ్ వర్మల్లో 7 మంది పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ భాస్కరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి అభిషేకం

శ్రీశైలం, మార్చి 27: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులను ఇచ్చారు.

జ్వాలావీరభద్ర స్వామికి పూజలు

శ్రీశైలం క్షేత్రంలో లోక కళ్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోష కాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ఈ స్వామికి అఘోర వీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు.

అలరించిన నిత్య కళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం కడపకు చెందిన నృత్యకళాక్షేత్రం బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేష స్తుతి, తాండవనృత్యకరి, అయిగిరినందిని, శివపంచాక్షరి, నటరాజ స్తుతి తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలం, మార్చి 27: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్న ప్రసాద వితరణ పథకానికి బుధవారం హైదరాబాద్ చెందిన ఎం.వెంకటేష్ అనే భక్తురాలు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే తిరుపతికి చెందిన సీహెచ్ నారాయణస్వామి అనే భక్తుడు రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్ష కుడు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదా లను అందజేసి సత్కరించారు.

'నీటి ఎద్దడి రాకుండా చూడాలి'

కొత్తపల్లి, మార్చి 27: ప్రస్తుత వేసవి కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జవహర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నీటి ఎద్దడి నివారణపై జిల్లా అధికారులు నిర్వహించిన వర్చువల్ మీటింగ్‌లో ఎంపీడీవోతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సార్వత్రిక ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు రాజకీయ సమావేశాలు, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని సూచించారు. అలాంటి వారిపై ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటే గ్రామ పంచాయతీల నిధుల నుంచి ఖర్చు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రసాయన పౌడర్

- ప్యాకెట్ ఓపెన్ చేస్తుండగా నోట్లోకి వెళ్లడంతో మహిళ మృతి

నందికొట్కూరు మార్చి 27: పట్టణంలోని వాల్మీకినగర్‌లో నివసిస్తున్న పద్మావతి(49) ప్రమాదవశాత్తు మృతి చెందారు. బుధవారం ఉదయం ఇంటి ముందు కల్లాపి చల్లేందుకు అందులో కలిపే రంగుల కవర్‌ను పద్మావతి ఓపెన్ చేశారు. దీంతో ఆ ప్యాకెట్‌లో ఉండే కెమికల్ నోట్లోకి, ముక్కులోకి వెళ్లడంతో వాంతులు అయ్యాయి. ఇది గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పద్మావతి చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

వ్యక్తి మృతి

కొత్తపల్లి, మార్చి 27: మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన పల్నాటి సుబ్రహ్మణ్యం (30) అనే వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలివీ.. సుబ్రహ్మణ్యంకు గతంలో కూడా అప్పుడప్పుడు మూర్ఛ వ్యాధి వస్తుండేదని చెప్పారు. బుధవారం సాయంత్రం తన ఇంట్లోని మరజున్నులో జొన్నలు వేసి పిండి ఆడిస్తుండగా మూర్ఛవ్యాధి రావడంతో వెల్లకిలో పడ్డాడు. దీంతో సుబ్రహ్మణ్యం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా.. ఇదివరకే మృతి చెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యంకు భార్య, కుమారుడు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు: డీఎంహెచ్‌వో



బండిఆత్మకూరులో రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బండిఆత్మకూరు, మార్చి 27: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం కాకనూరు, సంతజూటూరు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాకనూరులో బోదకాలు వ్యక్తికి కిట్‌ను ఆయన అందజేశారు. అనంతరం బండిఆత్మకూరు పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్, రోగుల వార్డు, కాన్పుల వార్డును పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్‌కుమార్, యశోద, సూపర్‌వైజర్ వెంకటశివన్న, సుబ్రమణ్యం, యశోద, వెంకట సుబ్బమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

'నెలాఖరులోగా జొన్న కొనుగోలు'



మిరప పంటను పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

వెలుగోడు, మార్చి 27: జిల్లాలో జొన్న కొనుగోలు రిజిస్ట్రేషన్‌లకు ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని రేగడగడూరులో పంట నిల్వలను ఆయన పరిశీలించారు. జిల్లాలో సాగు చేసిన 19 మండలాల్లో జొన్న కొనుగోలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికి 983 మంది రైతులకు చెందిన 6500 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశామన్నారు. డీఎం నాగరాజు, ఏడీ ఆంజనేయులు, ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారం.. భయాందోళనలో ప్రజలు

కొత్తపల్లి, మార్చి 27: అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన ఎలుగుబంటి తరచూ గ్రామ శివారులోకి వస్తుండటంతో గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. బుధవారం మండలంలోని ఎదురుపాడు గ్రామ పొలిమేరలో ఎలుగుబంటి సంచారాన్ని గమనించి గొర్రెల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు. గొర్రెల కాపరులు తిమ్మరాజుకుంట చెరువు సమీపంలో గొర్రెల కాపరులు గొర్రెలు మేపుతుండగా.. అటువైపు ఎలుగుబంటి రావడాన్ని గమనించి కేకలు వేయడంతో అక్కడి నుంచి సమీపంలోని నీటి ముంపు పొలాల్లోకి పరారైందని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఆత్మకూరు ఫారెస్టు రేంజ్ అధికారి పట్టాభిని వివరణ కోరగా.. ఈరోజు ఎటువంటి ఎలుగుబంటి సంచారం లేదని, వారం రోజుల క్రితం సంచరించినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే అటవిశాఖ అధికారులు ఎలుగుబంటి జాడ కోసం ఆయా ప్రదేశాల్లో గాలింపు చర్యలు చేపట్టి తిరిగి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. నీటి కోసం గ్రామశివారులోని నీటి గుంతలు ఉన్నందు వల్ల నీరు తాగేందుకు తరుచూ ఎలుగుబంటి వస్తుంటుందని గ్రామస్థులు చెప్పారు.

నేడు వాహనాల మళ్లింపు

నంద్యాల క్రైం, మార్చి 27: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల పర్యటన నేపథ్యంలో పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కొన్ని డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ బుధవారం వెల్లడించారు. వెంకటేశ్వరపురం నుంచి వచ్చే వాహనాలకు టౌన్‌లోకి అనుమతిలేదని చెప్పారు. వాటిని హైవే మీదుగా డైవర్షన్ చేసినట్లు తెలిపారు. వై జంక్షన్ నుంచి ఫ్లై ఓవర్ మీదుగా బొమ్మల సత్రం, క్రాంతినగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఎస్పీజీ హైస్కూల్, రైల్వేస్టేషన్ మీదుగా మళ్లించామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి సీఎం మీటింగ్‌కు వచ్చే వాహనాలు పార్కింగ్ చేసుకొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలు ప్రజలను బొమ్మలసత్రం వద్ద దింపి ఎస్పీవై రెడ్డి కళాశాల దాటిన తర్వాత కుందూనది పక్కన ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే పాణ్యం, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు ప్రాంతాలనుంచి వచ్చే వాహనాలు ప్రజలను పొగాకు కంపెనీ సర్కిల్‌లో దింపి ప్రథమ నంది వద్ద ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. శ్రీశైలం, ఆత్మకూరు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు చామకాల్వ వై జంక్షన్ వద్ద దింపి ఎస్పీజీ హైస్కూల్ గ్రౌండ్ పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సీఎం మీటింగ్‌కు వచ్చే ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు తదితర వాహనాలు హోలీ క్రాస్ స్కూల్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రదేశంలో, ఆర్‌కే ఫంక్షన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని సీఐ సూచించారు.

'రైతులకు రాయితీపై కొత్త రకం విత్తనాలు'



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నంద్యాల టౌన్, మార్చి 27: రైతులకు రాయితీపై కొత్త రకం వంగడాల విత్తనాలను అందజేసే విషయంపై చర్చించినట్లు జిల్లా వ్యవసాయాధికారి టి.మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ, డాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాత వంగడాలపై వేరుశనగ కే-6, వరిలో బీపీటీ -5204, ఎన్‌డీఎల్ఆర్ -7, ఆర్ఎన్ఆర్ -15048, టీసీజీఎస్ -1694, లేపాక్షి, వీబీఎన్-8, ఎన్‌బీఈజీ -452, 857, తదితర వంగడాలను సాగు చేసే విషయంపై చర్చించినట్లు తెలిపారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అశోక్‌కుమార్, ఏపీ సీడ్స్ డిప్యూటీ మేనేజర్ జె.ధనలక్ష్మి, డాట్ కోఆర్డినేటర్ రామకృష్ణారావు, సహాయ సంచాలకులు ఆర్ శారదాదేవి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'



నంద్యాలలో శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న శబరి, ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 27: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని విశ్వనగర్‌లో బుధవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ అధికారం కోసం లేనిపోని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ధ్వజమెత్తారు. నంద్యాల పార్లమెంట్‌లో ఒక్క ప్రాజెక్టును నిర్మించకుండా, పరిశ్రమలను తీసుకురాకుండా ఏ ముఖం పెట్టుకొని జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలకు వస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తాటిరెడ్డి తులసిరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, వివిధ విభాగాల టీడీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం శిబిరం ఏర్పాటు అభినందనీయం'

సినీ నటుడు రామ్ చరణ్‌తేజ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను నంద్యాల రామ్ చరణ్ యువ శక్తి జిల్లా అధ్యక్షుడు పబ్బతి రవికుమార్, జనసేన పార్టీ నంద్యాల నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వనాథ్, ఆ పార్టీ సీనియర్ నాయకుడు పిడతల సుధాకర్, అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మెగా అభిమానులు, జనసేన సైనికులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, సాయిజయత్, సందీప్, సురేష్, నగేష్, అమర్, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో ముస్లింలకు అన్యాయం'

నందికొట్కూరు మార్చి 27: వైసీపీ ఐదేళ్ల కాలంలో ముస్లింలకు అన్యాయం జరిగిందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి ఆరోపించారు. మిడ్తూరు మండలం ఉప్పలదడియ గ్రామంలో జరుగుతున్న ఉరుసులో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నంద్యాలకు జగన్ ఏం చేశారు : ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 27: నంద్యాలకు సీఎం జగన్ ఏం చేశారో చెప్పి నంద్యాలకు నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణంలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోకవర్గంలో ఎలాంటి అభివృద్ధి లేదని, నీరు, నిధులు, నియామకాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, బీసీ టీడీపీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



అబ్దుల్లాపురంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, మార్చి 27: ఆత్మకూరు మండలంలో టీడీపీలోకి చేరికలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో సిద్ధాపురం గ్రామానికి చెందిన డేరంగుల దుర్గన్న ఆధ్వర్యంలో సుమారు 20కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారిలో చిన్న వెంకటేశ్వర్లు, పెద్దవెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు రామగోపాల్, రాజేష్, మల్లి, దరగయ్య, మహేష్ తదితరులు ఉన్నారు. వడ్లరామాపురం గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు రామనాథ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలోకి చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, గ్రామ నాయకులు ధర్మారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వెలుగోడు: అబ్దుల్లాపురంలో సర్పంచ్ నాగలక్ష్మమ్మ, సీనియర్ నాయకుడు ఉదారు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రత్నస్వామి, మౌలాలి, చంద్రశేఖర్, లబ్బి నాగస్వామి వీరన్నతో పాటు మరో 60 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి.

బండిఆత్మకూరు: పరమటూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన రంగస్వామిరెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డితో పాటు వందకుపైగా కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రామలింగారెడ్డి, నరసింహారెడ్డి, మనోహర్‌చౌదరి, కృష్ణారెడ్డి, సాయిబాబారెడ్డి, బాబు, రామలింగం, చిన్నలింగారెడ్డి, బుగ్గరాముడు, రామచంద్రుడు, పెద్దన్న, చెన్నారెడ్డి, అంబ్రోస్, జనసేన సురేష్, జాకీర్, ప్రతాప్ పాల్గొన్నారు.

'టీడీపీతోనే యువతకు ఉద్యోగావకాశాలు'



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య

పగిడ్యాల, మార్చి 27: టీడీపీతోనే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయమని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో బుధవారం టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. జయసూర్య మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకపోవడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత వైసీపీదే అని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నా, రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అనతరం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన నాగేశులు కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, జనసేన నాయకులు రవి కుమార్, టీడీపీ గ్రామ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, విజేయుడు, నాగన్న, శ్రీను, అశోక్, నాగరాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

మహానంది, మార్చి 27: మహానంది క్షేత్రంలో భక్తుల వసతి కల్పనలో భాగంగా బుధవారం నిర్వహించిన వివిధ రకాల సేవల బహిరంగ వేలాలను దేవదాయశాఖ నిర్ణహించిన విధంగా కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఏడాది పాటు భక్తులకు నవగ్రహాల వద్ద దీపారాధన చెయ్యించే హక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనే హక్కుతో పాటు వాహనాల పూజ, ప్రతిరోజు ప్రధాన ఆలయాల్లో పూల సరఫరా చేసే హక్కులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్లు దేవస్థానానికి ఆశించినంత ఆదాయం వచ్చే విధంగా టెండర్లు వెయ్యక పోవడంతో వాయిదా వేశామని చెప్పారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తిరిగి బహిరంగ వేలాలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా'



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

డోన్, మార్చి 27: డోన్ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో సుబ్బారెడ్డిని పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, అంకిరెడ్డి, మాజీ సర్పంచ్ రాముడు, ఆయా గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పదవిని అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు.

30న భారీ సభ: టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మధ్య అధినేత చంద్రబాబు సయోధ్య కుదిరిన నేపథ్యంలో డోన్ పట్టణంలో భారీ సభను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పాత టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించే ఈ సభకు కోట్ల కుటుంబ సభ్యులతో పాటు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి హాజరవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

బనగానపల్లె: డోన్ నియోజకవర్గంలో టీడీపీని బలోపేతానికి కృషిచేసిన ధర్మవరం సుబ్బారెడ్డి సేవలను గుర్తించి టీడీపీ జాతీయ కార్యదర్శి నారా చంద్రబాబునాయుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడం పట్ల నంద్యాల జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన ధర్మవరం సుబ్బారెడ్డికి చంద్రబాబునాయుడు మంచి గుర్తింపు ఇవ్వడం హర్షణీయమన్నారు. న్యాయవాది నాగేంద్రారెడ్డి, టీడీపీ కోశాధికారి ఖాదర్, నాయకులు బాలరాజు, యాగంటిపల్లె దస్తగిరి పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

సంజామల, మార్చి 27: చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన సంజామల టీడీపీ కార్యాలయంలో మండలస్థాయి టీడీపీ నాయకలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 29న చంద్రబాబు ప్రజాగళం యాత్రలో భాగంగా బనగానపల్లె పట్టణానికి వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని మండలాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్రజాగళం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, కానాల కేశవరెడ్డి, నట్లకొత్తూరు మోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, మూసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఆకుమళ్ల తిమ్మయ్య మాజీ సర్పంచ్ హుసేని, పుల్లారెడ్డి, ముదిగేడు మోహన్‌రెడ్డి, పసుపుల మహమ్మద్, ఎగ్గోని విష్ణువర్ధన్‌రెడ్డి, తోకల మద్దిలేటి, మల్కిహుసేని, మోటారు నాగేశ్వరరావు, మాధవ, సుబ్బారావు, రవి, శేఖర్, పొంతాల చంద్రశేఖర్, మంగపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, బండి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, మార్చి 27: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన షేక్ మదన్‌సావలి (30) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మాసూంవలి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. రంగాపురం గ్రామానికి చెందిన మదన్‌సావలి అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడని తెలిపారు. ఈనెల 24న మద్దిలేటి స్వామి ఆలయ ముఖద్వారం వద్ద ప్రమాద వశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. కోలుకోలేక మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'టీడీపీ నాయకుల మృతి తీరని లోటు'

చాగలమర్రి, మార్చి 27: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన గడ్డం సంజీవరెడ్డి (60), జ్ఞానమ్మ (55) మృతి తీరని లోటు అని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. భూమా జగత్ విఖ్యాతరెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహాలపై పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, రామ్మోహన్, హరి, శ్రీనివాసులు, సంజీవరెడ్డి, జీవన్, చౌడన్న, ఓబుళపతి, కేశవరెడ్డి ఉన్నారు.

'సన్మార్గంలో నడవాలి'

రుద్రవరం, మార్చి 27: ప్రతి మనిషి సన్మార్గంలో నడవాలని, దేశ సేవలో తమ ప్రాణాలు అర్పించిన అమరవీరుల కోసం అందరూ ప్రార్థనలు చేయాలని ఆటో యాత్రికుడు అబ్దుల్‌గఫార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆటోయాత్ర నిర్వహించారు.

పాముల జీవన విధానంపై అవగాహన

బనగానపల్లె, మార్చి 27: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాముల జీవన విధానంపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. పాముల జీవన విధానం, పర్యావరణం, పాము కాటు నుంచి ఎలా తప్పించుకోవాలి అన్న అంశంపై ఈస్ట్రన్‌ఘాట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ తరపున స్నేక్ రిస్క్యూయర్ మహమ్మద్ ఇద్రుస్ అవగాహన కల్పించారు. ఫారెస్టు రేంజ్ అధికారి ప్రవన్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి సుబ్బయ్య, బీట్ అధికారులు సురేంద్రనాయుడు, షమన్‌షావలి, జయమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

చాగలమర్రి, మార్చి 27: మండలంలోని క్రిష్ణంపల్లె గ్రామంలో జమాల్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం జియారత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా వద్ద కమిటీ సభ్యులు పాతేహాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

15 కుటుంబాలు టీడీపీలో చేరిక

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె నియోజవర్గంలోని సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన శివానంద రెడ్డి, ముడిమెల మైల సుబ్బరాయుడు, మైల సుభాష్, రహమాన్, మంగలి గిరీశ్, చవ్వా విజయభాస్కర్, మిఠాయిగారి మగ్బుల్‌బాషా, చాకలి చిన్నకంబయ్య, కట్టుబడి బాబు, మహబూబ్‌సాహెబ్, కొమ్ము సుంకయ్య, కట్టుబడి మగ్బుల్ బాషా, చాకలి సురేశ్ తదితర 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన నాయ కులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుతంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. కేవలం చంద్రబాబు వల్లనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు. అనంతరం బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మనమంతా చంద్రబాబు నాయుడును సీఎం చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

నిరుద్యోగ భృతి రూ.3వేలు: కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని మిద్దెపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ అసమర్థ పాలనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. టీడీపీ హయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం చాలా దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రైతుభరోసా కింద ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడ్, శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, దేవరబండ వెంకటనా రాయణ, మిద్దెపల్లి గోవిందు, తాడూరు వెంకటరమణయ్య, కొచ్చెర్వు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

డోన్(రూరల్): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు సీలం భాస్కర్ నాయుడు, సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో 20 మంది వైసీపీ కార్యకర్తలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు.



మిద్దెపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

రైతుపై దాడి చేసిన వైసీపీ నేతను అరెస్టు చేయాలి

ప్యాపిలి, మార్చి 27: అప్పు చెల్లించలేదని రైతు క్రిష్ణమూర్తిపై దాడి చేసిన వైసీపీ నేత లక్ష్మీనారాయణరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలోని ఇంటికి వెళ్లి టీడీపీ నేతలు రైతు క్రిష్ణమూర్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావుయాదవ్ మాట్లాడుతూ క్రిష్ణమూర్తి టీడీపీ సానుభూతి పరుడైనందుకే వైసీపీ నేత దాడి చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరుతుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వైసీపీ నేతను అరెస్టు చేయకపోతే ఆందోళనలు చేస్తామని నాగేశ్వరరావుయాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, కోదండ రామయ్య, బీజేపీ నేతలు దామోదర్‌నాయుడు, కేసీ మద్దిలేటి పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల అభివృద్ధి: కోట్ల నివేదిత

డోన్, మార్చి 27: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ జనసేన, బీజేపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని జగన్ మాట ఇచ్చి మహిళలకు మోసం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, ఎస్ఎండీ రఫీ, భాష్యం శ్రీధర్‌గౌడ్, ఓంప్రకాష్, కేఈ శ్యాం, మర్రి మణి, దీలీప్ రెడ్డి, చాటకొండ రజని, ఎన్ఈ సరోజ, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, ఆర్మీ రామయ్య, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డోన్(రూరల్), మార్చి 27: ఏపీ మోడల్ స్కూల్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. బుధవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు.

పుట్టాలమ్మ క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నంద్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో బాగంగా బుధవారం లక్ష్మీనరసింహస్వామికి వసంతోత్సవం, పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామికి పాన్పుసేవ నిర్వహించారు. దీంతో పుట్టాలమ్మ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

'తాగునీటి సమస్యను పరిష్కరించాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

రుద్రవరం, మార్చి 27: తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో రామచంద్ర సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటిని రవాణా చేయడానికి వాటర్ ట్యాంకులు, బోర్లకు మరమ్మతులకు సంబంధించి గ్రామాల వారీగా నివేదిక ఇవ్వాలని అన్నారు. మండలంలోని 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో ఏవేవీ అవసరమవతాయో వాటిని నివేదిక రూపంలో ఇవ్వాలని ఆయన సూచించారు. పలువురు కార్యదర్శులు గ్రామాల వారీగా ఎంపీడీవోకు నివేదికలు అందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

ప్యాపిలి, మార్చి 27: మండలంలో 9 రోజులపాటు జరిగిన పది పరీక్షలు బుధవారం ముగిశాయి. మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 950 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు పరీక్షలు రాసి ఒకరినొకరు బైబై చెప్పుకుంటూ వెళ్లారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు విజయకేతనం చూపిస్తూ మళ్లీ కలుదామంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. బాలుర పాఠశాలలో 310 మంది, బాలికల పాఠశాలలో 245, సెయింట్‌ఆన్స్ పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

రుద్రవరం: పదో తరగతి సాధారణ పరీక్షలు ఒకేషనల్ మినహా బుధవారంతో ముగిశాయి. రుద్రవరం, నరసాపురం పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారు. ఒకేషనల్ పరీక్ష ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాయాల్సి ఉందని నిర్వాహకులు తెలిపారు. సాధారణ పరీక్షలు ముగిశాయని చెప్పారు. విద్యార్థులు ఒకరికొకరు బై చెప్పుకుంటూ ఎవరి గ్రామాలకు వారు వెళ్లిపోయారు.

కొలిమిగుండ్ల: మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయునిపేట, కొలిమిగుండ్ల మో డల్ స్కూల్‌లో 562 మంది విద్యార్థులకు గాను 526 మంది విద్యార్థులు పది పరీ క్షలు రాశారు. 36 మంది గైర్హాజరయ్యారు. పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవోలు అబ్దుల్‌కలాం, రాజయ్యలు సంయుక్తంగా తెలిపారు.



ప్యాపిలిలో పరీక్షలు రాసి బయటికి వస్తున్న విద్యార్థులు



చాగలమర్రిలో..

ఎన్నికల ప్రచారంలో వలంటీర్

ప్యాపిలి, మార్చి 27: మండలంలోని జలదుర్గం గ్రామంలో బుధువారం వైసీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామ వలంటీర్ మహేంద్ర పాల్గొన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని అధికారులు చెబుతున్న ఫలితం కనిపించడం లేదు. వలం టీర్లు తమ పంతాను మార్చుకోవడం లేదన్ని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రచారం పాల్గొన్న మహేంద్రను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని ఆ గ్రామ టీడీపీ నాయ కులు అధికారులను కోరుతున్నారు.



జలదుర్గంలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

హోమియోపతి వైద్యుడికి అవార్డు

నంద్యాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సోరియాసిస్ వ్యాధి సోకిన వారికి నివారణకు కృషి చేసిన ఆళ్లగడ్డ పట్టణ హోమియోపతి వైద్యుడు ఏవీ రామసుబ్రమణ్యంను బ్యాంకాంక్ దేశంలోని సీఓఏ(క్లస్టర్ ఆఫ్ అచీవర్స్ అవార్డ్) సంస్థ ఇంటర్నేషనల్ అవార్డుతో సన్మానించింది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాలలో బుధవారం ఏవి రామసుబ్రమణ్యంను ఆళ్లగడ్డ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అవోపా, రోటరీ క్లబ్ సంస్థలు శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, న్యాయవాది సుబ్బారెడ్డి, అవోపా అధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'

చాగలమర్రి, మార్చి 27: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని టీడీపీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. బుధవారం చాగలమర్రిలోని టీడీపీ కార్యాలయంలో బీసీ సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అమలు చేస్తామని, పింఛన్ నెలకు రూ.4 వేలు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారని అన్నారు. బీసీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, మహబూబ్‌బాషా, రామతీర్థం, పీరయ్య, బాబయ్య, రామకృష్ణ, సుబ్బరాయుడు, దస్తగిరి, రంగనాయకులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే క్రైస్తవుల అభ్యున్నతి: బీసీ



బీసీ జనార్దన్‌రెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

కోవెలకుంట్ల, మార్చి 27: టీడీపీ హయాంలోనే క్రైస్తవుల అభ్యున్నతి జరిగిందని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని పేరా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కోవెల కుంట్ల హోలీగాడ్స్ పాస్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సేవకుల సదస్సులో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హ యాంలో క్రైస్తవులకు ప్రతి సంవత్సరం క్రిస్మస్ పండుగకు కానుక అందించారని, అనేక చర్చీల మరమ్మతులకు ఆర్థిక సాయం అందించారని అన్నారు. ఈసందర్భంగా పాస్టర్లు బీసీ జనార్దన్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించారు. కోవెలకుంట్ల మండల పాస్టరు, టీడీపీ నాయకుడు మురళి, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె పట్టణంలో ఈనెల 29న నిర్వహించే ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనడానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వస్తున్న సందర్భంగా గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల, పట్టణ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సమావేశం ఉంటుందని, ఈసమావేశానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని బీసీ పిలుపునిచ్చారు. నారాచంద్ర బాబునాయుడు ప్రజాగళం సభను విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

'పండ్ల తోటల సాగు లాభదాయకం'

చాగలమర్రి, మార్చి 27: పండ్ల తోటల సాగు లాభదాయకమని జిల్లా ఉపాధి ఏపీడీ సాంబశివుడు అన్నారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1,600 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం ఉందని, ఇప్పటి వరకు 750ఎకరాలు గుర్తించామని చెప్పారు. కూలీలకు 100 రోజులు పనిదినాలు కల్పిస్తున్నామని అన్నారు. 96 శాతం ఉపాధి పనులు పూర్తి చేశామని చెప్పారు. ప్రస్తుతం 5,500 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. రైతులకు వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 27: చాగలమర్రి గ్రామంలోని పది పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోటయ్య బుధవారం తనిఖీ చేశారు. బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రాలను సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. ఆయన వెంట ఎంఈవో అనూరాధ, సీఆర్పీలు ఉన్నారు.

రుద్రవరం: పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోటయ్య చెప్పారు. బుధవారం రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో 11 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎక్కడ ఏ సమస్య లేదన్నారు. ఆయన వెంట ఎస్ఐ మురళీమోహన్ ఉన్నారు.

జిల్లాకు చేరుకున్న సీఎం జగన్



చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

చాగలమర్రి, మార్చి 27: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాత్రి 10 గంటలకు ఆళ్లగడ్డకు చేరుకున్నారు. 'మేము సిద్ధం' బస్సుయాత్రలో భాగంగా ఆళ్లగడ్డలోని శిల్పా టౌన్‌షిప్‌లో ఆయన బస చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైసీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న సీఎం జగన్ బస్సులోనే ఉంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. నంద్యాలలో గురువారం సీఎం జగన్ రోడ్‌షో కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు: ఎస్పీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

చాగలమర్రి, మార్చి 27: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. చాగలమర్రి టోల్‌ప్లాజా సమీపంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేవారు. కడప జిల్లా నుంచి నంద్యాల జిల్లా వైపు వస్తున్న వాహనాలను నిలిపి పోలీసులు తనిఖీ చేయడాన్ని పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో అక్రమ మద్యం, నగదు, గంజాయి తదితర రవాణా కాకుండా చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసులను 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాలో ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణా అడ్డుకునేందుకు పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఏదైన అనుమానం వస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆళ్లగడ్డ ట్రైనీ డీఎస్పీ రఘువీర్, రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ రమణయ్య, పోలీసులు ఉన్నారు.

ఫాతిమా మృతికి బీసీ ఇందిరమ్మ నివాళి

బనగానపల్లె, మార్చి 27: పట్టణంలోని ఖాజీవాడా కాలనీకి చెందిన టీడీపీ సానుభూతిపరురాలు షేక్ ఫాతిమా(60) మృతి చెందడంతో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ, అవుకు మండలం టీడీపీ నాయకుడు వంగల పరమేశ్వరరెడ్డితో కలసి బుధవారం ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. ఆమె మృతి బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు అల్తాఫ్‌హుసేన్ ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: మాజీ మంత్రి



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

దొర్నిపాడు, మార్చి 27: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం గుండుపాపల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. గుండుపాపల గ్రామానికి చెందిన 130 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. భార్గవ్‌రామ్, జగత్ విఖ్యాతరెడ్డి, మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి, ఏరువ ప్రసాదరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, భూమా సందీప్‌రెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి ఉన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం చాగలమర్రి ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు అన్సర్‌బాషా, నరసింహారెడ్డి, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, ఉసేన్ వలి, షరీఫ్, జెట్టి నాగరాజు పాల్గొన్నారు.